జనపథం - జనపదం

(జనులు నడిచే బాట ... జనులు నుడివే మాట)

# భిన్నత్వంలో ఏకత్వం

- నిత్యానంద్.

ఐదు పదులు దాటుతున్న డేవిడ్‌కి కాస్తంత నలతగా ఉంది. కార్యాలయానికి సెలవు పెట్టాలంటే కష్టం. పని ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంది. ఒక్కొక్కసారి శని, ఆదివారములు వస్తున్నాయా, పోతున్నాయా అనే ధ్యాసకూడా ఉండడంలేదు. రోజూ బస్సులో 25 నిమిషముల ప్రయాణము చేసి వెళ్ళాలి ఆఫీసుకి. ఆపై 15 నిమిషముల కాలి నడక. దూరము కాదుగాని, పట్టణము నడిబొడ్డులో వాహనములు నిలుపడానికి కట్టే రుసుము చాలా ఎక్కువ. రద్దీలేని సమయములో 8 నిమిషములకు మించి పట్టని ప్రయాణము, ఉదయము రద్దీ సమయములో కారులో ప్రయాణముచేస్తే మూడు రెట్లు సమయము పడుతుంది. ఈ సమస్య అందరూ ఎదుర్కొనేదే అవడము మూలాన, అందరూ బస్సు ప్రయాణమునే సాగిస్తుంటారు. అయితే ఆ బస్సు ఎప్పుడూ నిండు గర్భినిలాగానే వస్తూ ఉంటుంది అతను ఎక్కే (బస్సులు నిలివే) స్థానమునకు. అతనికి ఆరోజు నిలబడి బస్సు ప్రయాణము చేసే ఓపిక లేదు. ఎవరైనా తనకి కూర్చోడానికి అవకాశమిస్తే బాగుండునని తన దైవాన్ని (జీసస్‌ను) మనస్ఫూర్తిగా వేడుకున్నాడు.

రమేష్ యువకుడు, మూడు దశాబ్దములు చూసిన వాడు, ఇప్పుడిప్పుడే తన ఉద్యోగములో ఉన్నత స్థితిని పొందాలని తహతహలాడుతున్నవాడు. ధూప, దీప, నైవేద్యములతో పూజను పూర్తిచేసి, మనసులో "భగవంతుడా! నన్ను సన్మార్గములో నడిపించు. నీవిచ్చిన ఈ మానవ జీవితాన్ని నలుగురికి ఉపయోగపడే సాధనముగా మలచు. ఒక తండ్రి తన బిడ్డను ఎలా ప్రేమిస్తాడో, తప్పుచేస్తే ఎలా మందలిస్తాడో, అవసరమైతే ఎలా దండిస్తాడో - అలాగే నన్ను నీవు కంటికి రెప్పలా కాపాడు స్వామీ!" అని కోరుకున్నాడు. త్వరితగతిని అల్పాహారం సేవించి, బస్సు ఆగు ప్రదేశమువైపు వడివడిగా నడక సాగించాడు. చూస్తూ ఉండగానే ఒక బస్సు వెళ్ళిపోయింది. ఇప్పుడు బస్సు ఆగే స్థలములో అతనొక్కడే ఉన్నాడు. మరొక 3 నిమిషములు గడిచేసరికి 15 మందివరకు చేరారు. మరొక 8 నిమిషములలో బస్సు వచ్చింది పీకలవరకు తాగిన వ్యక్తిలా తూగుతూ. రమేష్‌కు కూర్చోడానికి సీటు దొరికింది. ఆ రోజు చెయ్యవలసిన పని గురించి ఆలోచిస్తున్నాడు. బస్సు రహదారిమీద రక్తవర్ణపు దీపాన్ని చూసినప్పుడల్లా - తన తోవకు అడ్డు వచ్చినపుడు బిగుసుకుపోయి ఆగితున్న నత్తను గుర్తు తెస్తోంది బస్సు. కొద్ది సమయముతరువాత బస్సు వేరొక స్థానములో ఆగింది. డేవిడ్‌తో పాటు మరి కొంతమంది బస్సులో అడుగుపెట్టారు. కూర్చోవడం సంగతి అటుంచి, నిలబడడానికి కూడా తగినంత స్థలములేదు. ఉస్సూరుమంటూ నిట్టూర్చాడు డేవిడ్. సరిగ్గా అదే క్షణములో రమేష్ మదిలో ఒక ఆలోచన మెదిలింది. "పాపం! ఆ పెద్దాయనకి సీటు ఇస్తే ...., నేను నిలబడడానికి కష్టపడనవసరములేదు." అనుకున్నాడు. డేవిడ్‌వైపు తిరిగి కళ్ళలో కళ్ళు కలుపుతూ, సైగ చేసాడు "ఇక్కడ కూర్చుంటారా?" అన్నట్లు.

డేవిడ్ కళ్ళల్లో కృతజ్ఞత మెరిసింది. రమేష్‌కు బయట, అంతరంగములో జీసస్‌కు ధన్యవాదములు తెలియజేసుకున్నాడు. "అంతా ఈశ్వరేచ్ఛ! నీ ఆజ్ఞలేకపోతే నాకు దొరికిన సీటు అతనికి ఇవ్వాలన్న ఆలోచన వచ్చేదా! దేవా! ఈ రోజు ఒక వ్యక్తికి ఆనందాన్ని చేకూర్చగలిగాను. ధన్యవాదములు." అనుకున్నాడు రమేష్ మనసులో.

"మనము తినే తిండి ఎవరు పండిస్తున్నారు?
హిందువా? .... మహమ్మదీయుడా? .... క్రైస్తవుడా? "
అని ఎప్పుడైనా ఆలోచించామా?

అయితే ఈ సన్నివేశము ఇలా జరగడానికి జీసస్ ఆశీర్వాదము పనిచేసిందా? ఈశ్వరుని ఆజ్ఞ పనిచేసిందా? అని ఆలోచిస్తే - ఆ ఇద్దరి రూపాలను సృష్టించుకున్నది మనమే. కాని దైవశక్తి ఒక్కటే. నీరు మనము ఉపయోగించే పాత్రను బట్టి రూపాన్ని సంతరించుకున్నట్లు, బొగ్గు భిన్నమైన పరిస్థితులలో విభిన్న రూపాలను పొందినట్లు (డైమండ్, గ్రాఫైట్ మొదలైనవి.) - నిరాకారుడు, నిర్గుణుడు, సర్వాంతర్యామి అని మనకు తెలిసిన భగవంతుడు ఏ రూపములో మనము తలిస్తే ఆ రూపములో ప్రత్యక్షం కాకపోతాడా? మన అవివేకం వల్ల అల్లా వేరు, జీసస్ వేరు, రాముడు వేరు, కృష్ణుడు వేరు అని మానసిక కల్లోలాన్ని, సమాజంలో వర్గ విభేదాలను సృష్టిస్తున్నాము. మనము తినే తిండి ఎవరు పండిస్తున్నారు? హిందువా? మహమ్మదీయుడా? క్రైస్తవుడా? అని ఎప్పుడైనా ఆలోచించామా? కాని, మనతో ప్రయాణం చేస్తున్న వ్యక్తి గురించి పదే పదే ప్రశ్నించుకుంటాం.

అందరిలోనూ రక్తము ఎర్రగానే ఉంటుంది. ఎవరికైనా దెబ్బతగిలినపుడు 'అమ్మా!' అనే అంటారు, కాకపోతే వారివారి భాషలో. అంతెందుకు అందరూ శ్వాస, దప్పిక, ఆనందము ఒకేవిధముగా ఉంటాయి. నిష్కల్మషమైన చిన్నారి చిరునవ్వు ఆ చిన్నారి కులమతాలను బట్టి మారదు. అయితే తేడా అంతా మనము చూసే దృష్టిలోనే ఉంది. సాటి వ్యక్తి పట్ల సోదరభావం కలిగి ఉండి, ఎదుటి వ్యక్తి కష్టాలలో ఉన్నప్పుడు మానవతా దృష్టితో తగిన సహాయాన్ని అందించడం చేయగలిగితే, మానవత్వమే మతమని అర్థం చేసుకోగలిగితే - స్వర్గాన్ని భువికి దించలేకపోతామా! మతాలని, ప్రవక్తలని గౌరవిస్తూ - భిన్నత్వములోని ఏకత్వమును గ్రహించగలిగితే - భూతల స్వర్గాన్ని, దానిలోని మాధుర్యాన్ని అనుభవపూర్వకముగా తెలుసుకోవచ్చు. సర్వేజనా: సుఖినోభవన్తు! *

అవమానించేవాడు ఇసుకపై రాత లాగ వెంటనే దానిని విస్మరిస్తాడు.
అవమానానికి గురయినవాడు ఇత్తడిపై చెక్కిన రాత లాగ ఎన్నటికీ మరచిపోలేడు.

ప్రపంచం దర్పణం వంటిది. నీ ప్రతిబింబమే అందులో కనిపిస్తుంది.

సంతోషంగా ఉండడానికి నిర్దిష్ఠ కారణం లేనివారే అత్యంత సంతోష జీవులుగా కనిపిస్తారు.

***